www.citytimesnews.com

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 95 | హైదరాబాద్ | శుక్రవారం | తేదీ:03.04.2026 | పేజీలు 10 | వెల రూ.3 | epaper.citytimesdaily.com


## నోరు తెరిస్తే దోమలు పోతున్నాయి

- హైదరాబాదులో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్న నిరసన
- దోమతెర ధరించి అసెంబ్లీ వద్దకు
- చేతిలో ఫాగింగ్ మిషన్ కూడా..
- దోమల నియంత్రణపై కాంగ్రెస్కు చిత్తశుద్ధి లేదు

2లో..

## కేంద్ర జలశక్తి మంత్రి క్షమాపణలు చెప్పాలి

- కాళేశ్వరంపై అర్థం పడటం లేని ఆరోపణలు
- లక్ష కోట్ల అవినీతి జరగలేదు
- దీటుగా స్పందించిన సభ్యుడు సురేష్ రెడ్డి
- కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే పిల్లర్లు కులాయి

2లో..

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచారు

- కిషన్ రెడ్డి పై హరీష్ రావు ఫైర్
- పార్లమెంట్ సాక్షిగా చేసిన కామెంట్లు దారుణం
- ఉద్యమంలో రాజీనామా చేయక పారిపోయిన కిషన్ రెడ్డి
- మరో ద్రోహానికి పాల్పడ్డారంటూ ఆగ్రహం

2లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు.

## ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ

- మంత్రి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై కదలిక
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- తొలి విడత ఇందిరమ్మ చాలావరకు పూర్తి
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇస్తాం
- దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ది



2లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు.

## మా రాష్ట్రానికి వచ్చి చూడండి

- ఆరు గ్యారెంటీలో అమలు చేస్తున్నాం
- పథకాల అమలులో ఎంతో విజయవంతం
- తెలంగాణ వచ్చి చూసి నేర్చుకోండి
- కేరళ సీఎం పినరాయి విజయం కి రేవంత్ సవాల్
- రైతుల సంక్షేమమే మా ప్రాధాన్యత
- రైతు భరోసా కింద 18 వేల కోట్లు రిలీజ్ చేశాం
- రైతులను ఆర్థికంగా ఆదుకుంటున్నాం
- చాలా తక్కువ సమయంలో 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం



**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

కేరళం సీఎం పినరయ్ విజయన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రానికి వచ్చి 'ఆరు గ్యారెంటీలు' ఎలా అమలు అవుతున్నాయో స్వయంగా చూసి నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తున్నాయో వివరించారు. రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతుల లోన్లు మాఫీ చేసినట్లు సీఎం తెలిపారు. అలాగే రైతు భరోసా కింద రూ.18 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేసి రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించామని సీఎం రేవంత్ చెప్పారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

10లో..

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా రాష్ట్రంకి వచ్చి మా సిక్స్ గ్యారెంటీలు ఎలా అలవుతున్నాయో చూడండి. రైతుల లోన్ వేవ్ చేశాము. రైతు భరోసా కింద 18 వేల కోట్ల రూపాయలు ఇచ్చాం. 67173 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాము. కేరళంలో పినరయ్ విజయన్‌కి సమయం అయిపోయింది. తెలంగాణలో కేసీఆర్ ఫ్యామిలీకి.. కేరళంలో పినరయ్ విజయన్‌కి పెద్ద తేడా లేదు. పదేళ్లలో అటు తెలంగాణను కేసీఆర్.. ఇటు కేరళంను పినరయ్ విజయన్ భ్రష్టు పట్టించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తోంది. ఈ నెలలో కేరళంలో కూడా మరో పదేళ్ల పాటు యూడీఎఫ్ గవర్నమెంట్ నడిచేలా ప్రభుత్వం వస్తుంది' అని అన్నారు.

## కిషన్ రెడ్డి వర్సెస్ కేఆర్ సురేష్ రెడ్డి

- కాళేశ్వరంపై వాడి వేడి చర్చ
- రాజ్యసభ వేదికగా విమర్శలు ప్రతి విమర్శలు
- కేంద్ర మంత్రి సి ఆర్ పాట్టీల్ కామెంట్లపై సురేష్ రెడ్డి అభ్యంతరం
- సురేష్ రెడ్డి కామెంట్లపై కిషన్ రెడ్డి గుస్సా
- మేడిగడ్డ పనికిరాకుండా పోయింది

4లో..



**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## అధికారులను బంధిస్తారా?

- బెంగాల్ సర్కార్ పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని వ్యాఖ్య
- దేశంలోనే అత్యంత ధ్రువనమైన రాష్ట్రం బెంగాల్

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ 'సర్'కు చెందిన అధికారులను దిగ్బంధించడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మందలించింది. ఇదంతా పక్కా ప్రణాళికతో చేసిన కుట్రగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. దీంతో బెంగాల్ ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

10లో..

బెంగాల్‌లోని మాల్దాలో న్యాయాధికారులను దిగ్బంధించి దాడులు జరిగినట్లుగా వచ్చిన వార్తలు తీవ్ర కలకలం రేపాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి అధికారులను బంధించి తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు న్యాయస్థానం దృష్టికి వచ్చింది. దీంతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్రంగా పరిగణించారు.

## నేను నిప్పులాంటి వ్యక్తిని

- నా గురించి అలా మాట్లాడుతారా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి
- కేంద్రం ఆధ్వర్యంలోని హం రోడ్లో టెండర్లు
- నిబంధనల ప్రకారమే టెండర్లు జరుగుతున్నాయి



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది.

9లో..

## ఆస్తిలో హక్కే కాదు సంరక్షణలో సమన బాధ్యత

- కుమార్తెలకు రెండు వర్తిస్తాయి
- తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

10లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కోరుకుంటున్న కుమార్తెలు.. వృద్ధాప్యంలో వారిని సంరక్షించే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తి హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం..

## బెంగాల్లో రాష్ట్రపతి పాలనకు కుట్ర

- సీఎం మమతా బెనర్జీ విమర్శలు
- వెస్ట్ బెంగాల్లో టెన్షన్ టెన్షన్
- మాల్దా ఘటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

2లో..

## 15 రోజులు బెంగాల్లోనే ఉంటా

- మమత ప్రభుత్వాన్ని గద్దె దించుతా
- కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా
- సురేంద్ర అధికారి నామినేషన్కు హాజరు



10లో..

## మా మిత్రులు సేఫ్

- హార్మోజ్ విషయంలో భారత్కు భరోసా
- ఇరాన్ దేశం కీలక ప్రకటన
- ఇండియాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు
- ఇండియా నౌకలు సురక్షితంగా ఉంటాయి
- ఇరాన్ రాయబార కార్యాలయ ప్రకటన

10లో..

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జల సంధిని ఇరాన్ నియంత్రించడంతో ట్యాంకర్ల రవాణా నిలిచిపోయి అంతర్జాతీయ మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. ఈ క్రమంలో భారత్‌కు ఊరట నిచ్చేలా ఇరాన్ గురువారం కీలక ప్రకటన చేసింది. హర్మ్యూజ్ జలసంధి గురించి తమ 'భారతీయ మిత్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. వారు సురక్షితంగా ఉన్నారు' అని ఇరాన్ తెలిపింది. ఈ మేరకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టి ఓ పోస్ట్‌లో తెలిపింది.



## బెంగాల్లో రాష్ట్రపతి
# పాలనకు కుట్ర

### - గంటలు తరబడి న్యాయాధికారుల దిగ్బంధం


కోల్‌కతా, సిటీ టైమ్స్


ఎన్నికల ముందు బెంగాల్ రాజకీయాలు ఉద్రిక్తంగా మారాయి. మాల్దా జిల్లాలో న్యాయాధికారులను గంటల తరబడి బంధించడంపై సుప్రీంకోర్టు రాష్ట్రాన్ని తీవ్రంగా మందలించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో పేర్లను తొలగించడంపై మొదలైన వివాదం ముట్టడి వరకు వెళ్లింది. సుప్రీంకోర్టు ఈ ఘటనపై తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తూ.. పశ్చిమ బెంగాల్ రాజకీయంగా అత్యంత విభజించబడిన రాష్ట్రంగా పేర్కొంది. మాల్దా జిల్లాలోని ఒక గ్రామంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పై పని చేస్తున్న న్యాయాధికారులపై జరిగిన దాడి అనంతరం సుప్రీంకోర్టు ఈ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. సాగర్‌దిఘిలో జరిగిన ఒక బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. ఈ ఘటనతో ప్రభుత్వానికి సంబంధం లేదని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఆగ్రహావేశాలే దీనికి కారణమని ఆమె పేర్కొన్నారు. న్యాయాధికారుల్ని ముట్టడించిన వ్యక్తులు ఎవరో తనకు తెలియదని, నా చేతిలో ఎలాంటి అధికారము లేది, శాంతిభద్రతలతో సహా అన్ని అధికారాలను వారు లాగేసుకున్నారని ఆమె అన్నారు. మాల్దాలో జరిగిన ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. ఓటమి భయంతో ఈ నెలలో జరగాల్సిన ఎన్నికల్ని రద్దు చేయింది, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని ప్లాన్ చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తూ.. శాంతిభద్రతల్ని తమ నియంత్రణలో ఉంచుకోవాలని భావించి, చివరకు విఫలమయ్యారని, న్యాయాధికారులకు రక్షణ కల్పించలేకపోయారని అన్నారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందువల్ల న్యాయాధికారులకు భద్రత కల్పించడం ఈసీ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. బెంగాల్ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడంపై బెంగాల్ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ప్రలోభాలకు లొంగొద్దని ఆమె కోరారు.

# డంపింగ్ యార్డును ఏర్పాటుచేస్తే దాని చితిమంటల్లో "ఆత్మార్పణ'చేసుకుంటా!

- హుజురాబాద్ పై"మరణ శాసనం"లిఖించబోతున్న డంపింగ్ యార్డ్!
- ప్రభుత్వం స్పందించకపోతే చెప్పింధి చేస్తా
- మాజీ ఎంపీపీ.. టిడిపి రాష్ట్ర నేత కందుల ఆదిరెడ్డి సంచలన ప్రకటన

హుజురాబాద్ ఏప్రిల్ 3
సిటీటైమ్స్ ప్రత్యేకప్రతినిధి



ఈ దశాబ్దం కాదు.. ఈ శతాబ్దం నాదేనని సగర్వంగా చాటుకున్న మహాకవి శ్రీశ్రీ మాదిరిగానే.. హుజురాబాద్ ప్రాంతం పేరు చెప్పగానే ముందు వరసలో ఉండే రెండు మూడు పేర్లలో కందుల ఆదిరెడ్డి (75) ఒకరిని చెప్పుకోక తప్పదు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన కందుల ఆదిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చంద్రబాబు నాయుడు సీఎంగా పనిచేసిన ఆనాటి కాలంలో ఆదిరెడ్డి తరచుగా చంద్రబాబును కలుసుకునే రీతిలో సంబంధాలు ఉండెవి. 1994లో పెద్దిరెడ్డి హుజురాబాద్ రాజకీయాలలో ప్రవేశించకపోతే ఆదిరెడ్డికి ఆనాడు టిడిపి టికెట్ ఇవ్వడానికి చంద్రబాబు దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చిన విషయం నేడు కొంతమందికి మాత్రమే గుర్తుండి ఉంటుంది. అలా ఆ చాన్స్ ఆనాడు ఆయనకు దూరమైంది. ఆ తర్వాత హుజురాబాద్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా ఆదిరెడ్డి ఐదు సంవత్సరాలపాటు పనిచేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా కూడా ఆయన అనేక సంవత్సరాల పాటు కొనసాగారు. 198283లో టిడిపి ఏర్పాటు జరిగిన నాటి నుండి నేటి వరకు ఆయన ఆ పార్టీలోనే కొనసాగుతూ వస్తున్నారు. ఇకపోతే హుజురాబాద్ ప్రాంత రాజకీయాలలో ఆదిరెడ్డి ఒక ట్రెండ్ సెట్టర్ గా తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా "సిటీ టైమ్స్" ద్వారా హుజురాబాద్ ప్రాంతానికి జరగబోతున్న దారుణమైన పరిస్థితులపై తన గళాన్ని విప్పడం స్థానికంగా సంచలనం రేపుతున్నది. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయం తెలియగానే మానసికంగా కలత చెంది ప్రాణత్యాగం చేయడానికి మానసికంగా సిద్ధమయ్యానని.. ఈ విషయాన్ని ఇంట్లోని వారందరికీ కూడా తెలియజేసి ఒప్పించడం కూడా జరిగిందని కందుల ఆదిరెడ్డి కన్నీటి పర్యంతమవుతూ తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల హుజురాబాద్ ప్రాంతంలో విచ్చలవిడిగా మరణాల సంఖ్య పెరిగిపోతుందని.. ప్రతి ఇల్లు వల్ల కాడుగా మారుతుందని.. ప్రతి కుటుంబం రోగాల కుప్పగా తయారవుతుందని.. కుటుంబంలో ఒకరో ఇద్దరో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని.. గర్భిణీల.. చిన్నపిల్లల.. వృద్ధుల.. వికలాంగుల పరిస్థితి చెప్పలేని విధంగా తయారవుతుందని ఆదిరెడ్డి హెచ్చరించారు. హుజురాబాద్ చుట్టూ ఉన్న వాగులు.. వంకలు.. గుండ్ల చెరువు.. మోడల్ చెరువు.. సింగాపురం చెరువు.. చిలక వాగు తోపాటుగా వందలాది కుంటలు.. వ్యవసాయ బావులు.. మంచినీరు అందించే బావులు పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వల్ల వేలాది ఎకరాలలో భూసారం దెబ్బతింటుందని.. వ్యవసాయ ఉత్పత్తులు పండవని.. కూరగాయలకు కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడుతుందని.

భూసారం తగ్గిపోవడం వల్ల ఈ ప్రాంతం ఎడారిమయం అవుతుందని.. భూములు అమ్ముకొని వలసలకు పోదామంటే భూముల ధరలు తగ్గిపోయి కొనేవారు కూడా ముందుకు రాని దారుణ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని ఆదిరెడ్డి హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులను ఊహించుకుంటేనే భయమేస్తున్నదని.. ఇది ఏ ఒక్కరి సమస్యగా పరిగణించవద్దని.. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ముందుకు రావలసిన తరుణం ఆసన్నమైందని.. ప్రభుత్వాలు మేల్కొనాలంటే ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం ఒక్కటే మన ముందున్న కర్తవ్యం అని ఆదిరెడ్డి గుర్తు చేశారు. ప్రాణాంతకమైన డంపింగ్ యార్డ్ ను ఎవరు అడగకపోయినా.. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా రాత్రికి రాత్రి దీనిని హుజురాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకోవడం ఎంతవరకు సమంజసమని ఆదిరెడ్డి ప్రశ్నించారు. దాదాపు 1000 కోట్ల రూపాయల విలువచేసే ఈ ప్రాజెక్టు వల్ల హుజురాబాద్ ఎడారిగా తయారవుతుందని తెలిసి కూడా ఆనాటి ప్రజా ప్రతినిధులు స్పందించలేదంటే.. వారు భారీగా ముడుపుల స్వీకరించారని ప్రతి ఒక్కరికి అర్థమవుతున్నట్లు ఆదిరెడ్డి నిక్కచ్చిగా వ్యాఖ్యానించారు.

**రేవంత్.. పొన్నంలకు విజ్ఞప్తి చేస్తున్నా!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పరిచయమని.. హుజురాబాద్ ప్రాంత ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేయాలని ఆదిరెడ్డి కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తనకు మంచి మిత్రుడే కాకుండా కుటుంబ సభ్యుడని.. హుజురాబాద్ ప్రజల శ్రేయస్సును ధృష్టిలో పెట్టుకోని ప్రాంతంతో నిత్య సంబంధాలు ఉన్నాయని.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు కాకుండా ముఖ్యమంత్రిని.. ఇతర మంత్రులను ఒప్పించాలనీ ఆదిరెడ్డి పొన్నం ప్రభాకర్ కు విఘ్నప్తి చెసారు. హుజురాబాద్ పట్టణంలో ప్రతి చోట ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరు స్పందించడం లేదని.. ఈ ఆక్రమణల వెనుక అన్ని పార్టీల నేతల.. కార్యకర్తల హస్తం ఉన్నదని ఆదిరెడ్డి ఆరోపించారు. డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణం ఈ ప్రాంతంలో పూర్తిగా సర్వనాశనం అవుతుందని.. పశువులు పక్షులు.. ఇతర జీవరాసులు అంతమవుతాయని.. ప్రజల జీవన స్థితిగతులు దారుణంగా దెబ్బతింటాయని.. మరణాల సంఖ్య రోజుకు పెరుగుతాయని.. ఇంతటి ఉపద్రవానికి దారి తీసే డంపింగ్ యార్డ్ ను అడ్డుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉద్యమాలు జరిగినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే డంపింగ్ యార్డ్ "చితిమంటల్లో" ఆత్మార్పణ చేసుకుంటానని తన కుమారుడు కందుల సందీప్ కు.. కోడలు కందుల గౌతమికి చెప్పినట్లు ఆదిరెడ్డి "సిటీ టైమ్స్" ప్రతినిధికి గురువారం రాత్రి వెల్లడించారు. వరంగల్ కరీంనగర్ జిల్లాల మధ్యలో ఉండే హుజురాబాద్ ప్రాంతం ఎంతో చారిత్రాత్మకమైనదని.. దేశానికి ప్రధానమంత్రిని (పీవీని) అందించిన ప్రాంతంగా గుర్తింపును పొందిందని.. మేధావులకు.. కళాకారులకు.. ఉద్దండులైన రాజకీయవేత్తలకు.. కవులకు.. వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన నిష్ణాతులకు పేరుగాంచిన ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసే సాహసం ప్రభుత్వానికి ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని ఆదిరెడ్డి వ్యాఖ్యానించారు.

## కేంద్ర జలశక్తి మంత్రి
# క్షమాపణలు చెప్పాలి



- కాళేశ్వరంపై అర్థం పడటం లేని ఆరోపణలు
- లక్ష కోట్ల అవినీతి జరగలేదు
- దీటుగా స్పందించిన సభ్యుడు కె.ఆర్ సురేష్ రెడ్డి
- కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే పిల్లర్లు కులాయి

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణకు జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు కూతలు కూసిన కేంద్ర జల్‌శక్తి మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించాలని కోరారు. ఏపీ అమరావతి రాజధానికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో సాగు, తాగు నీరు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకున్నా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ గా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు కూతలు కూసిన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని హెచ్చరించారు. కాళేశ్వరంలో లక్షా కోట్లు అవినీతి జరిగిందని కేంద్ర మంత్రి తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మూడు బ్యారేజ్‌లు, 15 రిజర్వాయర్లు, 15 వేల పైపులైన్లు, 25 టన్నెళ్లు ఉన్నాయని వివరించారు. అనేక విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు . అయితే కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల రెండు పిల్లర్లు కుంగిపోయాయని, మూడు వందల కోట్లతో మరమ్మతులు చేస్తే ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని వెల్లడించారు.

# నోరు తెరిస్తే దోమలు పోతున్నాయి

- హైదరాబాదులో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్న నిరసన
- దోమతెర ధరించి అసెంబ్లీ వద్దకు
- చేతిలో ఫాగింగ్ మిషన్ కూడా..
- దోమల నియంత్రణపై కాంగ్రెస్కు చిత్తశుద్ధి లేదు

హైదరాబాద్, సిటీ టైమ్స్



దోమల నియంత్రణ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వినూత్న రీతిలో నిసరన వ్యక్తం చేశారు. దోమ తెర ధరించి, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీ వద్దకు వచ్చారు. అనుమతి లేదని మార్షల్స్ అడ్డుకోగా.. వారిని ప్రతిఘటించారు. అసెంబ్లీ సమావేశాలు జరగని సమయంలో కొత్త నిబంధనలు ఎక్కడివని ప్రశ్నించారు.

దోమలు విపరీతంగా పెరిగాయి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తర్వాత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ--- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమల తీవ్రతకు ప్రజలు హైదరాబాద్ నుంచి పారిపోతున్నారని వ్యాఖ్యానించారు. నగరంలో రోజురోజుకు దోమలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దోమల నియంత్రణపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జంటనగరాల్లోని చెరువుల్లో గుర్రపుడెక్క ఆకు అధికంగా పేరుకుపోవడంతో--- వాటిలో దోమలు విస్తృతంగా పెరుగుతున్నాయని తెలిపారు.

ఉదయం మరియు సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వెళ్లే ప్రజలు దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయేమోనని భయపడుతున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి చెప్పారు. చాలా మంది వాకింగ్‌కు రావడానికి వెనుకాడుతున్నారని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఎల్బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో గుర్రపుడెక్క ఆకు పేరుకుపోకుండా డ్రోన్ల ద్వారా ప్రయోగాత్మకంగా చర్యలు తీసుకుని విజయవంతం చేశామని చెప్పారు. అలాగే దోమల లార్వాను నియంత్రించేందుకు గంబూజియా జాతి చేప పిల్లలను చెరువుల్లో వదిలి మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. డ్రోన్ సాంకేతికతతో చెరువు మధ్య ప్రాంతాల్లో కూడా మందులు పిచికారీ చేయడం జరిగిందని చెప్పారు.

కానీ ప్రస్తుత ప్రభుత్వం--- ప్రజా ఆరోగ్యంపై సరైన దృష్టి పెట్టకుండా, చెరువుల్లో పేరుకుపోతున్న గుర్రపుడెక్క ఆకును తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి--- తక్షణ చర్యలు తీసుకోవాలని సుధీర్ రెడ్డి కోరారు.

## ఈ నెలాఖరులోగా
# రెండో విడత ఇందిరమ్మ

### - అర్హుల ఎంపికపై అధికారులు కసరత్తు చేయాలి

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచారు

హైదరాబాద్, సిటీ టైమ్స్




తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు.

ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంట అన్నట్లు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు.

కిషన్‌రెడ్డికి సవాల్

ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు.

క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీశ్‌రావు విమరించారు. 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

# సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్2(సిటీటైమ్స్):**
సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కొనియాడారు. గురువారం సుభాష్ నగర్ డివిజన్ పరిధి అరవై గజాలు తెలుగు తల్లి నగర్ లో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ గర్వకారణమైన మహా వీరుడు, సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. సర్వాయి పాపన్న అన్యాయానికి ఎదురు నిలబడి సామాన్య ప్రజల స్వేచ్ఛ, గౌరవం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహానుభావుడని అన్నారు. ఆయన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య మహాముని సంఘం అధ్యక్షులు ఎంఎస్ గౌడ్, సభ్యులు రాజు గౌడ్, రమణ, జిహెచ్ రాజు, పవన్, వెంకటేష్, సుబ్బా రావు, కరాటే శ్రీను, శ్రీను, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, బలరాం రెడ్డి, కోలా శ్రీకాంత్, రాజ్ కుమార్, గుబ్బల లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ గౌడ్, తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# కట్నం కోసం భర్త వేధింపులు... భార్య ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**
మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, బీహార్ రాష్ట్రానికి చెందిన ఇషిక యాదవ్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ బన్సాల్ 2020 సంవత్సరంలో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పరచుకుని పరస్పరం ప్రేమించుకున్నారు. అనంతరం పెద్దల సమక్షంలో 20 ఫిబ్రవరి 2026న వివాహం చేసుకున్నారు. వివాహానంతరం దంపతులు మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో అదనపు కట్నం తీసుకురావాలని భర్త నీరజ్ బన్సాల్ తన భార్య ఇషిక యాదవ్‌ను మానసికంగా వేధిస్తున్నాడని ప్రాథమికంగా తెలిసింది. ఈ వేధింపులను తట్టుకోలేక ఇషిక యాదవ్ తమ నివాసంలోని హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీ సహాయంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఉదయం సమయంలో భర్త గమనించి స్థానికుల సహాయంతో ఆమెను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.



# ఆటిజం చిన్నారుల కోసం తొలి కమ్యూనికేషన్ బోర్డు ఏర్పాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**
ఆటిజంతో బాధపడుతున్న వారు ఇతరులతో సంభాషించడానికి, సమాజంలో తమదైన గుర్తింపును పొందడానికి కమ్యూనికేషన్ బోర్డు మరింత సులభతరం చేస్తుందని ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్ అన్నారు. గురువారం, ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్, జయేష్ రంజన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ చేతుల మీదుగా దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా కమ్యూనికేషన్ బోర్డును అధికారికంగా ప్రారంభించారు.

అవాజ్ డాట్ కామ్ అనే అగ్మెంటేటివ్ ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్ (ఏఏసీ) ప్లాట్‌ఫారమ్ నుండి సేకరించిన అత్యంత ముఖ్యమైన విజువల్ గుర్తులతో ఈ కమ్యూనికేషన్ బోర్డును రూపొందించారు. మాటల ద్వారా సంభాషించడంలో ఇబ్బంది పడే పిల్లలు ఆరుబయట ఆడుకునే సమయంలో తమ అవసరాలను, ఇష్టాలను, భావోద్వేగాలను వ్యక్తపరచడానికి ఈ చిహ్నాలు ఎంతగానో దోహదపడతాయి.



డాక్టర్ ప్రతిమ గిరి, మర్హమ్ సంస్థకు చెందిన డాక్టర్ నబాత్ లఖానీ ప్రేరణతో కలిసి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రారంభోత్సవంలో సైనా నెహ్వాల్ మాట్లాడుతూ ప్రతి బిడ్డకు మెరుగ్గా రాణించే మరియు ప్రపంచంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకునే శక్తి ఉంటుందని అన్నారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ చొరవను కేవలం ఒక్కదానితోనే ఆపేయబోమని, దీనిని మరిన్ని పార్కులు, మాల్స్, ఇతర బహిరంగ ప్రదేశాలకు చేరేలా చూస్తామని తెలిపారు.

ఈ పరికరాన్ని సామాజిక వాతావరణంలో ఏర్పాటు చేయడం ద్వారా కేవలం క్లినికల్ విద్యాసంస్థలకే పరిమితం కాకుండా సమ్మిళిత పద్ధతులను సాధారణీకరించే దిశగా ఈ చొరవ ఒక ముఖ్యమైన అడుగు వేసింది. ఇది విభిన్న సంభాషణా అవసరాల గురించి ప్రజలలో అవగాహన పెంచడమే కాకుండా మరింత ఆమోదయోగ్యమైన మరియు స్పందనాత్మక సమాజాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ మైలురాయి వంటి ప్రాజెక్ట్ అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో సమిష్టి కృషి శక్తిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. భారతదేశంలోని బహిరంగ ప్రదేశాలలో ఇలాంటి సమ్మిళిత మార్పులకు ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుంది. దీని ద్వారా ప్రతి బిడ్డ వెళ్తున్న ప్రతి చోటా తమ గొంతును వినిపిస్తూ తమ భావాలను పంచుకునేలా ఈ చొరవ భరోసా ఇస్తుందన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఘనంగా ప్రారంభోత్సవాలు

- మెట్ల బావి పార్క్ ప్రారంభోత్సవం, ఇండోర్ స్టేడియం పనుల శంకుస్థాపన
- ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ప్రారంభోత్సవాల వేడుకలు జరుపుకోవడం అభినందనీయమని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కొనియాడారు. గురువారం కొండాపూర్ డివిజన్ మాధవ హిల్స్ కాలనీలో రూ. 95 లక్షలతో అభివృద్ధి చేసిన మెట్ల బావి పార్క్ ప్రారంభోత్సవం, చందానగర్ డివిజన్ పరిధిలోని పిజేఆర్ స్టేడియంలో రూ. 1.70 కోట్లతో ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ చేతుల మీదుగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మాధవ హిల్స్ కాలనీలో మెట్ల బావి పార్క్ ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

క్రీడాకారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసుకురావడంలో క్రీడలు ఎంతో తోడ్పడతాయని, పిల్లలకు చదువుతో పాటు క్రీడలు కూడా సమానంగా ముఖ్యమని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, పిల్లలు చదువులతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలంటే ఇండోర్ స్టేడియం ఉపయోగపడుతుందని చెప్పారు. మెట్ల బావి పార్క్‌తో ప్రాంతంలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, తిరుపతి, మల్లేష్ యాదవ్, శశాంక్, విజయ్, దీపక్, పవన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి భూమి పూజ

### ప్రత్యేక పూజలు నిర్వహించిన రంగరాయ ప్రసాద్

**నిజాంపేట్, ఏప్రిల్2( సిటీటైమ్స్):**
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమంతుడి కోసం ఆలయ నిర్మాణం చేయడానికి భూమి పూజ నిర్వహించడం అభినందనీయమని, ప్రజలందరిపై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆకాంక్షించారు. గురువారం నిజాంపేట సర్కిల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ నగర్ లో ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం కోసం శుభ ముహూర్తంలో ఘనంగా భూమి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# అందరిపై శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఉండాలి

### మాజీ మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులు

**నిజాంపేట్, ఏప్రిల్2(సిటీటైమ్స్):**
ప్రజలు అందరిపై శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఉండాలని మాజీ మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా నిజాంపేట్ 12వ డివిజన్ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, సుబ్బారెడ్డి, భక్తులు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర నిర్వహించారు.



# గండిపేటలో విషాదం..

### నీటి సంపులో పడి 8 నెలల శిశువు మృతి

**సైబరాబాద్, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**
రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధి గండిపేట గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి 8 నెలల శిశువు మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా గండిపేట గ్రామంలో తహశీల్దార్ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న తేజస్ శ్రీకాంత్ జాధవ్ (22) అనే కూలీ ఈ నెల 1న ఉదయం తన తల్లి ఉషా, సోదరుడు శంకర్‌తో కలిసి పనికి వెళ్లాడు. ఇంట్లో భార్య రాధికతో పాటు వారి 8 నెలల కుమారుడు సౌరభ్ జాధవ్ ఉన్నారు.మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో శంకర్ ఇంటికి తిరిగి రాగా, ఆ శబ్దంతో రాధిక మేల్కొని చూసే సరికి శిశువు కనిపించలేదు. వెంటనే కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి వద్ద ఉన్న నీటి సంపు మూత తెరిచి ఉండటం గమనించారు. సంపులో చూడగా శిశువు నీటిలో తేలుతూ కనిపించాడు.

తక్షణమే శిశువును బయటకు తీసి రైన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి శిశువు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనలో ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నార్సింగి ఎస్‌హెచ్ఓ హరికృష్ణ రెడ్డి తెలిపారు.






# విద్యానగర్ కాలనీలో గ్రామసభ సక్సెస్

- సమిష్టి కృషితోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలి
- మౌలిక వసతులతో పల్లెల రూపురేఖలు మారుస్తాం
- ఎమ్మెల్యే కూనంనేని

**చుంచుపల్లి , సిటీ టైమ్స్ ,**

మండల పరిధిలోని విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ అధ్యక్షతన జరిగిన '99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ఆయన మాట్లాడుతూ అందరం కలిసి గ్రామాన్ని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని, ఇప్పటికే పంచాయతీలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను దాదాపుగా పూర్తి చేశామని , రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ , గ్రామ అభివృద్ధికి తన వంతుగా పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు . గ్రామసభలు ఎల్ ఈడి టీవీ ఏర్పాటుచేసి ప్రజా పాలన ముఖ్య ఉద్దేశాలను వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. ఎల్ ఈడి ఆకర్షణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి , వివిధ వార్డ్ మెంబర్స్ , మండల స్పెషల్ ఆఫీసర్ డిఐఈఓ వెంకటేశ్వరరావు , ఇన్చార్జి తాసిల్దార్ నాగరాజు , ఎంపీడీవో సుభాషిని , పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు , జూనియర్ అసిస్టెంట్ రవికుమార్ , పంచాయతీ గుమస్తా రామకృష్ణ , బిల్ కలెక్టర్లు అమర్ నాథ్, సురేష్, కిషోర్, బోస్, పిచ్చయ్య, శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ , గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# "సుడా"ఇంట జరిగిన పెళ్లి సందడిలో పాల్గొన్న"ప్రణవ్"

**నూతన వధూవరులను ఆశీర్వదించిన వోడితెల**

**హుజురాబాద్ ఏప్రిల్ 3**
**సిటీటైమ్స్ ప్రత్యేకప్రతినిధి**

కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్వగృహంలో గురువారం జరిగిన పెళ్లి సందడి కార్యక్రమంలో హుజరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కరీంనగర్ శివారులో గల ధర్మరాజుపల్లెకు సమీపంలో ఉన్నటువంటి వసుధ కన్వెన్షన్ లో ఘనంగా.. వైభవంగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా..ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండే కాకుండా హైదరాబాద్ తో పాటుగా రాష్ట్రం నలుమూలనకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు.. బంధువులు పెద్ద సంఖ్యలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు వీరంతా తరలి రావడంతో వసుధ కన్వెన్షన్ సెంటర్ కిక్కిరిసిపోయింది. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రణవ్ బాబు... రాష్ట్ర మంత్రివర్యులైన దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిళ్ళ శ్రీను బాబుతో కలిసి ఈ పెళ్లి సందడి కార్యక్రమానికి హాజరైన ప్రణవ్ నూతన దంపతులు రుషితా రెడ్డి... రాహుల్ రెడ్డి ని ఆశీర్వదించి వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో ప్రత్యేకంగా భేటీ అయిన ప్రణవ్ ఆయనతో అరగంటసేపు చర్చలు జరపడం విశేషం.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అసమానం

- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి
- నివాళులు అర్పించిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**

బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అసమానమని, ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కొనియాడారు. గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి సోదరులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొట్టమొదటి బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి, బహుజన నాయకుడు అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి, రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవితం అసమానమని అన్నారు. సామాన్యులను సైనికులుగా మార్చి భువనగిరి కోటనే కాదు, ఏకంగా గోల్కొండ కోటను కూడా స్వాధీనం చేసుకున్న సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. భారతదేశాన్ని పాలించిన మొఘల్ చక్రవర్తులు పాపన్నపై దాడి చేసినప్పుడు, సామాన్యుల్లో స్ఫూర్తిని నింపి మొఘల్ సైన్యాన్ని ఓడించాడే తప్ప ఎక్కడా లొంగలేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పుట్ట వినయ్ కుమార్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లీలానంద గౌడ్, కోశాధికారి నిమ్మల ధాత్రినాథ్ గౌడ్, గౌడ సంఘం ప్రముఖులు పి. అశోక్ గౌడ్, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, నిమ్మల ఆనంద్ గౌడ్, మూల అనిల్ గౌడ్, ఏకాంత్ గౌడ్, లింగం గౌడ్, మల్లేష్ గౌడ్, రాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీరేందర్ గౌడ్, పవన్ గౌడ్, సాయికుమార్ గౌడ్, జగన్ గౌడ్, గణేష్ గౌడ్ మరియు రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, మల్లేష్ గౌడ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో.. అక్కడ హనుమంతుడు ఉంటాడు

- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ
- వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు
- శేరిలింగంపల్లిలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర
- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**

ఎక్కడ శ్రీరాముడు కొలువై ఉంటాడో, ఎక్కడ శ్రీరామ నామం వినిపిస్తుందో అక్కడ హనుమంతుడు ఉంటాడని, ఆయనను మించిన భక్తుడు లేడని, శ్రీ రామచంద్రుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న భాగ్యశాలి హనుమంతుడని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం హనుమాన్ జయంతి పర్వదినం పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లిలో సీనియర్ నాయకులు చింతకింది రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో, చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారాంలో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్లు మంజుల, రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రామాయణానికి హనుమంతుడు ఓ నిండుదనాన్ని తీసుకువచ్చాడని, సుగ్రీవుడిలో కదలిక తీసుకువచ్చి అతని సైన్యాన్ని ముందుకు నడిపించడంలోనూ, లంకలో ఉన్న సీతమ్మవారి ఆచూకీ తెలుసుకోవడంలోనూ, వారధి నిర్మించడంలోనూ కీలక పాత్ర పోషించాడని తెలిపారు. యుద్ధరంగంలో లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు 'సంజీవిని' పర్వతాన్ని తెచ్చి ప్రాణాలను కాపాడిన ఘనత కూడా హనుమంతుడిదేనని పేర్కొన్నారు. అందుకే హనుమంతుడులేని రామాయణాన్ని అసలు ఊహించలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసగాళ్లకు చెక్ పెట్టిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

- 17 సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించి 19 మంది అరెస్ట్



**సైబరాబాద్, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**

దేశవ్యాప్తంగా గత వారం రోజులలో వివిధ మోసాలకు పాల్పడుతున్న 17 సైబర్ కేసులను విజయవంతంగా ఛేదించిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 19 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. డీసీపీ టి. సాయిమనోహర్ తెలిపిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసగాళ్లు పాల్పడిన 17 కేసుల్లో 19 మందిని గత వారం రోజులలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అరెస్టు అయిన 19 మందిలో 12 మందికి ట్రేడింగ్ మోసాలతో సంబంధం ఉందని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో 125 కేసుల్లో 884 రిఫండ్ ఆర్డర్లు పొందడంతో రూ. 4,35,58,181/ బాధితులకు తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు. ఈ వారంలో రూ. 2.93 కోట్ల ట్రేడింగ్ ఫ్రాడ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన ట్రేడింగ్ ఫ్రాడ్ కేసులో, మోసగాళ్లు నకిలీ వాట్సాప్ ట్రేడింగ్ గ్రూప్ ద్వారా ఒక బాధితుడిని రూ. 2,93,50,000/ మేర మోసం చేసిన భారీ ఘటనను ఛేదించారు. బాధితుడిని నకిలీ వాట్సాప్ ట్రేడింగ్ గ్రూప్‌లో చేర్చి, తమను ప్రొఫెషనల్ అడ్వైజర్లుగా చూపిస్తూ నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లు పంపి నమ్మకం కలిగించారు.

నిందితులు ట్రేడింగ్ ప్లాన్లు, బ్లాక్ ట్రేడ్స్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్, ఐపీఓ పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు వస్తాయని చెప్పి బాధితుడిని ఆకర్షించారు. నకిలీ ఇన్‌స్టిట్యూషనల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ పేరుతో పెట్టుబడులు పెట్టించాలని చెప్పి, బాధితుడి నుంచి డబ్బును పలు బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేయించారు. మొదట కొంత మొత్తాన్ని తీసుకునే అవకాశం ఇచ్చి నమ్మకం పెంచి, తర్వాత నకిలీ లాభాలు చూపిస్తూ మరింత పెట్టుబడులు పెట్టమని ఒత్తిడి చేశారు. చివరకు అనేక మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించి డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారు. ఈ క్రమంలో కమీషన్ కోసం మోసపూరిత సొమ్మును మళ్లించేందుకు ఇతరుల బ్యాంకు ఖాతాలను తెరిచి సరఫరా చేసినందుకు తెలంగాణకు చెందిన శేఖర్, తినేష్ కుమార్ ప్రజాపతి అనే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ట్రేడింగ్ పెట్టుబడి పథకాల పేరుతో ఖచ్చితమైన లేదా అసాధారణంగా ఎక్కువ లాభాలు ఇస్తామని చెప్పే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను నమ్మవద్దని, డబ్బు పెట్టే ముందు పెట్టుబడి సలహాదారులు, కంపెనీలు, ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు నిజమైనవో కాదో అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.

# కిషన్ రెడ్డి వర్సెస్ కేఆర్ సురేష్ రెడ్డి

- బీఆర్ఎస్ ఏ కారణం అన్న కిషన్ రెడ్డి
- నిపుణుల కమిటీ కూడా ఇదే చెప్పింది
- తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- కేంద్రంపై సురేష్ రెడ్డి విమర్శలు

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.

"కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

**తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి**

కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. " ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

# రైడ్ షేరింగ్ పద్ధతితోనే ట్రాఫిక్ కష్టాలకు బ్రేక్






- ఐటీ కారిడార్ ట్రాఫిక్ నియంత్రణకు రైడ్ షేరింగ్ సూచన
- మాదాపూర్ పోలీసుల సర్వేలో వెల్లడైన ఆసక్తికర అంశాలు

**సైబరాబాద్, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**

ఐటీ ఉద్యోగులు, సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఐటీ హబ్ కారిడార్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి.
కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 మంది అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది.
ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృథా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల ప్రమాదం, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసినప్పటికీ అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడానికే మొగ్గు చూపడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు.
ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ కుమార్, ఆర్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు మరియు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసుల ముఖ్య సూచనలుగా సాధ్యమైనంత వరకు రైడ్ షేరింగ్ పద్ధతిని పాటించాలని, సహోద్యోగులు లేదా స్నేహితులతో కలిసి కార్ పూలింగ్ చేయాలని, మెట్రో, బస్సు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగాన్ని పెంచాలని, పీక్ అవర్స్‌లో అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించాలని, పాఠశాల, కళాశాల వాహనాలు నడిచే రద్దీ సమయాల్లో ప్రయాణించకుండా ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

## భక్తి జ్వాలల్లో శేరిలింగంపల్లి..

# వైభవంగా ఆంజనేయుని జయంతి





- గోపనపల్లి, రాయదుర్గంలో ఘన వేడుకలు
- శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు, అన్నదానంతో ఉత్సవ వాతావరణం
- హనుమంతుని ఆదర్శం యువతకు దారిదీపం

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (సిటీటైమ్స్):**

జయహనుమాన్ ఘోషలతో ఊగిపోయిన శేరిలింగంపల్లి. ఆంజనేయుని జయంతి సందర్భంగా నియోజకవర్గం అంతటా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోపనపల్లి తండాలో, రాయదుర్గంలో నిర్వహించిన శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడింది. వీధులన్నీ జయహనుమాన్ నినాదాలతో మారుమోగాయి.

**గోపనపల్లిలో భక్తి వెల్లువ**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి తండాలో గల శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలం, ధైర్యం, పరాక్రమానికి మారుపేరు హనుమంతుడని, పట్టుదల, కార్యదీక్ష, స్వామి భక్తికి ఆయనే ప్రతీక అని అన్నారు. చైత్ర మాస పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగ హనుమంతుని జన్మదినాన్ని స్మరించుకునేదని తెలిపారు. ఆయనను ఆరాధించడం ద్వారా దుష్టశక్తుల నుంచి రక్షణ లభించడమే కాకుండా సద్గుణాలు పెంపొందుతాయని వివరించారు. సనాతన ధర్మాన్ని ఆచరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హనుమంతుని జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**రాయదుర్గంలో భక్తి జోష్**

రాయదుర్గం గ్రామంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త సంటి సాంబశివ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరికలను నెరవేర్చే దైవంగా స్వామిని కొనియాడుతూ, ఆయన కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.
హనుమంతుడు భక్తి, బలం, ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన మహోన్నతుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా సానుకూల వాతావరణాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారి ఆశీర్వాదాలు పొందారు


# 6 గ్యారెంటీలు అమలు చేయాలి
# కెసిఆర్ పథకాలు కొనసాగించాలి



**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**హుజూరాబాద్ ఏప్రిల్ 3**
**సిటీ టైమ్స్ ప్రతినిధి**

శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల హామీని అమలు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. హుజూరాబాద్ మండలం రాజపల్లి, సిర్సపల్లి గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలకు సర్పంచ్ లు కటుకూరి మల్లా రెడ్డి, పోల్సాని రామారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు పరచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అలవి కాని పనులు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు విక్రయించిన ధాన్యానికి బోనస్ చెల్లించడంలో తాత్సారం చేస్తోందని అన్నారు. కల్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్ పథకం.. వృద్ధులకు 4 వేలు, వికలాంగులకు 6 వేలు పెంచుతామన్న పెన్షన్ గుర్తుకు లేదా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కనీసం రైతాంగానికి యూరియా అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని సూచించారు. అలాగే హుజూరాబాద్ సమీపంలో చేపట్ట తలపెట్టిన డంపింగ్ యార్డు నిర్మాణం వల్ల వాయు, జల కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటు తో వెలువడే విష వాయువుల ప్రభావం వల్ల శ్వాస కోస, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల సోకుతాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టకుండ అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ నెల 3 న హుజూరాబాద్ పట్టణ బంద్ కు పిలుపునిస్తున్నట్లు ఎం ఎల్ ఎ తెలిపారు. డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని, పార్టీలకు అతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. గ్రామ సభల్లో డీఆర్డీఏ పీవో శ్రీధర్, ఆర్డీవో రమేష్ బాబు, ఎంపీడీఓ సునీత తదితర గ్రామ పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకట శివ రామాలయంలో
# హనుమాన్ విజయోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు

**నిజాంపేట్, ఏప్రిల్2( సిటీటైమ్స్):**

శ్రీ వెంకట శివ రామాలయంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులలో ప్రజలంతా సుఖఃసంతోషాలతో వర్థిల్లాలని ఆలయ ధర్మకర్త మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ఆకాంక్షించారు. గురువారం హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి, ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీర్థప్రసాదాలు పుచ్చుకున్నారు.

# తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- వ్యవసాయాన్ని కాపాడటానికి మహాసభలు వేదిక కాబోతున్నాయి
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

కొత్తగూడెం పట్టణంలో గల సిపిఎం కార్యాలయం మంచిగంటి భవనంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో 50 శాతం మందికి పైగా వ్యవసాయం పైన ఆధారపడుతున్నారని అటువంటి ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందని ఆయన అంటూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల వలన దేశంలో , రాష్ట్రంలో రైతాంగాన్ని కాపాడటానికి వ్యవసాయాన్ని రక్షించడానికి ఉద్యమాలను రూపు కల్పన చేయటానికి మూడవ రాష్ట్ర మహాసభలు కొత్తగూడెం పట్టణంలో ఏప్రిల్ 23, 24 ,25 తేదీలలో జరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా రైతాంగానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జలసూత్రం శివరాం ప్రసాద్ , వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు , అన్నవరపు కనకయ్య ఎలమంచి వంశీకృష్ణ ,అన్నవరపు సత్యనారాయణ కున్సోత్ ధర్మ ,కొండ బోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .



# గ్రామ సభలతోనే కాలం వెళ్లదీస్తారా

- దరఖాస్తులు స్వీకరణ తప్ప పరిష్కారం ఏది
- ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది
- మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

రాష్ట్రంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయడం మాని గ్రామ సభల పేరుతో కాలయాపన చేస్తోందని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఫైరయ్యారు. గ్రామ సభలతోనే ఐదేళ్ల కాలం వెళ్లదీసేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటికి మూడుసార్లు ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించారని, స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో మాత్రం ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన గ్రామసభల్లో తిరిగి ప్రజల నుంచి దరఖాస్తులు కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో స్వీకరించిన దరఖాస్తులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత జవాబుదారీగా ఉండాలని తెలియదా అని అడిగారు. గ్రామసభ నిర్వహించిన ప్రతిసారి పథకం కావాలంటే అప్లై చేసుకోవాలని చెప్పడంతో ఈ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని స్పష్టం చేశారు. సభలు, సమావేశాలు మాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అయినట్లే అని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచనలు చేశారు



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com




# హుజురాబాద్‌లో ఉత్సాహంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'

**- సంక్షేమ పథకాలపై అవగాహన**

హుజురాబాద్, ఏప్రిల్ 03సిటీ టైమ్స్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గురువారం హుజురాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 30వ వార్డు (విద్యానగర్) లో ప్రత్యేక సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ జాతీయ గీతంతో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల పురోగతిని వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, సొంత స్థలం ఉన్న నిరుపేదలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఇంటి నిర్మాణానికి తోడ్పాటు, కొత్తగా మంజూరైన తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, అలాగే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్ల మంజూరు గురించి ఆమె వివరించారు.

**చిన్నారులకు దుస్తుల పంపిణీ**

అనంతరం, ఐసీడీఎస్ పట్టణ సూపర్ వైజర్ రమ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి అశ్విని గాంధీ, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ యాదగిరి, మున్సిపల్ జవాన్ రొంటాల సుధీర్, అంగన్‌వాడీ టీచర్ కె. రాణి, ఆర్పీ శోభారాణి, సీఎల్ఆర్పీ రమాదేవిలతో పాటు వార్డు ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**- ఎకరా పొలంలో గౌడ సామూహిక భవన నిర్మాణం: ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి సిటీ టైమ్స్ ఏప్రిల్ 02

బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, గెరిల్లా యుద్ధ విధానంలో గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన పాపన్న బహుజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్ననాడు మొఘల్, జమీందారుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, పేదలు, బహుజనుల రక్షకుడిగా నిలిచారని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు వనపర్తి జిల్లా కేంద్రంలో గౌడ సోదరుల సౌకర్యార్థం ఒక ఎకరా స్థలంలో సామూహిక నిర్మాణ భవనం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అయినవోలులో విషాదం

**- తల్లి ఇద్దరు పిల్లలు అనుమానాస్పద మృతి**
**- స్విమ్మింగ్ పూల్ లో మునిగి..**
**- భారతి తన భార్య ఇద్దరు పిల్లలను చంపాడని ఆరోపణలు**

వరంగల్, సిటీ టైమ్స్



వరంగల్ జిల్లా ఐనవోలు మండలం పున్నేలులో తల్లి, ఇద్దరు కుమార్తెలు స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్. రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్ లో ఇద్దరు కూతుర్లు తల్లి మృతి పైన ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఇతర అధికారులతో కలిసి కేసు దర్యాప్తు పురోగతిని అడిగి తెలుసుకున్నారు సీపీ.

మరణాలకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి, త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ లోని సీసి కెమెరాల హార్డ్ డిస్క్ స్వాధీనం చేసుకున్నారు. భర్త హజారుద్దీన్ ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. భర్త హజారుద్దీనే భార్య, ఇద్దరు పిల్లలను చంపాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# ప్రజా సేవలకు నూతన దిశ...భరోసా కేంద్రం ప్రభుత్వ భవనానికి తరలింపు : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి





**- అద్దె భవనం నుంచి ప్రభుత్వ భవనానికి భరోసా కేంద్రం తరలింపు...**
**- డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఎస్సై పాతనివాస భవనం...**
**- మరమ్మత్తు పనులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ...**

వనపర్తి క్రైమ్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 02

గురువారం రోజు ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, వనపర్తి జిల్లా కేంద్రంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న భరోసా కేంద్రాన్ని డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న ఎస్సై పాతనివాస భవనానికి మార్చేందుకు చేపడుతున్న మరమ్మత్తు పనులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్. స్వయంగా భరోసా భవనం మరమత్ పనులను పరిశీలించి, మరమ్మత్తులు, అవసరమైన సదుపాయాల కల్పన, సిబ్బందికి అనుకూలమైన వాతావరణం వంటి అంశాలను ఎస్పీ సమీక్షించారు. భరోసా కేంద్రం కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం ఉండదు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోనే నిర్వహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించగలుగుతామని భరోసా కేంద్రం వంటి ప్రజలకు నేరుగా సేవలందించే ముఖ్య కేంద్రాలు మరింత సౌకర్యవంతమైన, భద్రమైన వాతావరణంలో పనిచేయడం అత్యంత అవసరం. ఈ మార్పుతో సేవల నాణ్యత పెరగడమే కాకుండా, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి సేవను బాధ్యతతో, సమర్థవంతంగా అందించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారుని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ, భరోస ఎస్సై, అంజద్, వనపర్తి పట్టణ 2వ ఎస్సై, శశిధర్, భరోసా కోఆర్డినేటర్, శిరీష తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి : డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి






**- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 02

తెలంగాణ ప్రజా ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గోపాల్ పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ 2005 కన్నా ముందు జయన్న తిరుమలాపురం గ్రామం ప్రజలు వలసలు వెళ్లేవారని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యాన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుండి సాగునీళ్లు వదలడంతో ఈ గ్రామ ప్రజలు పాడి పరిశ్రమ ,పంటలు పండించుకోవడంతో ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఉన్నప్పుడేజయన్న తిరుమలాపురం గ్రామంలో గ్రామపంచాయతీ, సబ్ స్టేషన్, బస్ షెల్టర్, వెటర్నరీ హాస్పిటల్, దేవాలయాల పునర్నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటివి నిర్మించుకున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినంక ఉచిత ఆర్టీసీ బస్సు, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్ , నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ , రెండు లక్షల రుణమాఫీ, క్వింటాల్ సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ హైడ్రా ద్వారా చెరువుల పునర్నిర్మాణం , డ్రగ్స్ ను అరికట్టుట, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా రేవంత్ రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. గ్రామంలో విద్యార్థులను తల్లి దండ్రులు ఉన్నతంగా చదివించినప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామంలో అనేక బెల్ట్ షాపులు ఉన్నాయి వాటిని మహిళలే బంద్ చేయించాలని మహిళలకు విన్నవించారు. సంగారెడ్డి లో రుద్రారం గ్రామం, వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం మాచనూరు గ్రామాలు అభివృద్ధి చెందిన గ్రామాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. వచ్చే రెండు మూడు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో జయన్న తిరుమలాపురం గ్రామం అభివృద్ధి చెంది ఆదర్శ గ్రామంగా నిలవాలని గ్రామస్తులను కోరారు.కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూగ్రామంలో ఏ సమస్యలు ఉన్న ప్రజా ప్రభుత్వం వాటిని పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తుందని అన్నారు. గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇస్తామని అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేయడానికి అనేక మంది రైతులు సానుకూలంగా ఉన్నారని భవిష్యత్తులో గ్రామ రైతులు ఆరోగ్యంగా ఆర్థికంగా నిలదొక్కుకోబోతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నంది మల్ల యాదయ్య, గ్రామ సర్పంచ్ జ్యోతి గోపాల్, ఉపసర్పంచ్ రాజు, అమరేందర్ రెడ్డి,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వారంలో పబ్లిక్ రీడింగ్ రూమ్ ఏర్పాటు

**- గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం**
**- గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు**

కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సుజాతనగర్ మండలం సర్వారం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నూతన గ్రంథాలయం పబ్లిక్ రీడింగ్ రూమ్ ఏర్పాటుకు ముఖ్యఅతిథిగా గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు ఆధునిక దేవాలయాలని , గ్రంథాలయాలు ఉపయోగించుకోవడం వల్ల మనిషి సమాజంలో ఒక మంచి ఆలోచనపరుడుగా మారడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయని , చిన్నతనం నుండి విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు , సర్పంచ్ సునీత, సహకార సొసైటీ మాజీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంబాబు, గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి, ఆఫీస్ ఇంచార్జ్ నవీన్ కుమార్ , స్థానిక గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# డంపింగ్ యార్డ్ తరలించే విషయమై

# ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నా!

- హుజురాబాద్ నుండి వేరే ప్రాంతానికి తరలించే యోచనలో ప్రభుత్వం?
- ఎమ్మెల్యే పదవికి అనర్హుడు కౌశిక్ రెడ్డి,వెంటనే భర్తరఫ్ చేయాలి.
- సోషల్ మీడియాలో రీల్స్,లైకులు తప్ప,ప్రజా సమస్యల పట్ల అవగాహన లేదు.
- ప్రజలను హిసించడం మానేసి,ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్న..
- హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకం,ఇప్పటికే మున్సిపల్ లో వ్యక్తిరేకంగా తీర్మానం చేశాం.
- పొలిటికల్ డైవర్షన్ కోసం కౌశిక్ రెడ్డి కొత్త నాటకం.
- చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందిస్తాం.



**హుజూరాబాద్ ఏప్రిల్ 3**
**సిటీ టైమ్స్ ప్రత్యేక ప్రతినిధి**

అసెంబ్లీ సాక్షిగా సీనియర్ శాసన సభ్యుడు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వివక్ష చూపించడం దారుణమని,సీనియర్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుని పట్ల కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందనీ,వెంటనే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు.గురువారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా కౌశిక్ రెడ్డి అరాచకాలు ఎక్కువ అయ్యాయని తన ప్రవర్తన రాష్ట్రం మొత్తం చూసిందని,ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని,కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని కోరారు.గతంలో గవర్నర్ ను,కులాలను ,మత విద్వేషాలు రెచ్చగొట్టేలాగా మాట్లాడడం,జర్నలిస్టులను,వ్యాపారస్తులను బెదిరించడం,కొట్టడం ,రైతులను తిట్టడంలాంటి వల్ల నియోజవర్గంలోని ప్రజలు ఇంకెంత కాలం భరించాలి అని తలలు పట్టుకుంటున్నారని,ప్రజలను ఇబ్బంది పెట్టే ఇలాంటి ఎమ్మెల్యే మాకు అవసరమా అని అనుకుంటున్నారని అన్నారు.ప్రభుత్వంలో ఉన్న మంత్రికి సంబంధించిన కంపెనీలపై సీబీ,సీఐడి విచారణ వేశామంటేనే మా పార్టీ ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని,కౌన్సిలర్లు,మండల,పట్టణ అధ్యక్షులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**డంపింగ్ యార్డు వేరే చోట మార్చడానికి కట్టుబడి ఉన్నాం..**

డంప్ యార్డ్ పై ఇప్పటికే అధికారులకు పూర్తి సమాచారం అందించామని,డంపింగ్ యార్డ్ సమస్యపై త్వరలో అఖిలపక్ష నేతలతో సీఎం రేవంత్ రెడ్డినీ కలుస్తామని ప్రజలకు హాని చేసే ఏ కార్యక్రమం ప్రభుత్వం తీసుకోదని మరోసారి స్పష్టం చేశారు ప్రణవ్.హుజూరాబాద్ నియోజకవర్గ భవిష్యత్ మాకు ముఖ్యమని ఇప్పటికే మంత్రులకు ఈ విషయంపై పలుమార్లు పూర్తి నివేదిక అందజేశామని,దీనిపై రద్దుకు మా వంతు కృషి చేస్తామని అన్నారు.అయితే డంపింగ్ యార్డ్ విషయంలో కావాలని కౌశిక్ రెడ్డి తనపై ఉన్న సీబీ,సిఐడి కేసు నుండి డైవర్షన్ కోసం కొత్త డ్రామా మొదలు పెట్టాడని ఎద్దేవా చేశారు.విచారణ 4తేదీ ఉందని దానికి ముందు బంద్ పిలుపు ఇవ్వడం,విచారణ తర్వాత దీక్షలో కూర్చుంటానని అనడం పట్ల రాజకీయ లబ్ధి స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు.వరంగల్ మీటింగ్ లో చొప్పదండి మీటింగ్ లో సీఎం అనని మాటలను అన్నట్టుగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని అన్నారు.ఎంత సేపు తన స్వంత రాజకీయ లాభం కోసం ఆలోచించడం తప్ప ప్రజల కోసం కౌశిక్ రెడ్డి చేసింది ఏం లేదని అన్నారు .2022లోనే డంప్ యార్డ్ ప్రతిపాదన వచ్చినప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్ రెడ్డి అప్పుడు సైలెంట్ గా ఉండి ఇప్పుడు మాట్లాడడం,ధర్నా చేస్తా అనడం రాజకీయ కోణం లేదా అని ప్రశ్నించారు.ఎవరెన్ని చెప్పినా డంప్ యార్డ్ వేరే స్థలానికి మార్చడం కాంగ్రెస్ తోనే సాధ్యమని తెలిపారు.

**దళిత వ్యతిరేకి కౌశిక్ రెడ్డి..**

దళిత బంధు విషయంలో అప్పుడు ఎమ్మెల్సీ గా,విప్ గా ఉన్న కౌశిక్ రెడ్డి పూర్తి స్థాయిలో ఎందుకు దళిత బంధు ఇవ్వలేదని,చంపినోడే సంతాప సభ పెట్టినట్టు దళిత బంధు విషయంలో అబద్ధాలు మాట్లాడుతున్నాడని అసలు దళిత బంధు ఆపిందే కౌశిక్ రెడ్డి అని,ఆనాడే అందరికి ఇవ్వగా ఎవరు ఆపారని ప్రశ్నించారు.కేవలం ఓట్ల కోసం వారిని వాడుకున్నారని నిజంగా వారి అభ్యున్నతికి పాటు పడాలనే ఉద్దేశ్యం ఉంటే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీ గా ఉన్నప్పుడే ఇచ్చే వాడని అన్నారు.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బంధు లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇస్తున్నామని ఓట్ల కోసం కాకుండా వారి అభ్యున్నతికి పాటు పడుతున్నామని అన్నారు.

**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం..**

రైతుల అవసరాల దృష్ట్యా సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయమని వారి కోరిక మేరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని,దీనిపై ఇప్పటికే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. రైతులెవరూ అధర్యపడవద్దని సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే





- సొంత ఇల్లు లేని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన లబ్ధిదారులు

**వనపర్తి సిటీ టైమ్స్ ఏప్రిల్ 02**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గురువారం గోపాల్పేట, ఏదుల మండలాలలోని పలువురి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు గోపాల్పేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి నాగమ్మ నరసింహ ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశానికి హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఏదుల మండల కేంద్రానికి చెందిన మొగిలి మన్నెమ్మ బాలస్వామి కొమ్ము ఈశ్వరమ్మ మల్లయ్య ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించారు చీర్కపల్లి గ్రామంలో ఎనిమిది నూతన గృహప్రవేశాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించారు

**1) ఎనుముల పద్మ w/o ఎనుముల మల్లయ్య**
**2)జమ్మిజ్యోతిw/o లక్ష్మయ్య**
**3)గడిగోపుల లక్ష్మిw/o శ్రీ రాములు**
**4)దొడ్ల లక్ష్మిw/o మైబుస్**
**5)బంకల చెన్నమ్మ w/o రాములు**
**6)ఎండి చాంద్ పాషా s/o బాస్ మియా**
**7)తలారి చెన్నమ్మw/o రాములు**
**8) తలారి సునీతw/o అశన్న**

గార్ల కుటుంబాలకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలియజేశారు అనంతరం బైకు యాక్సిడెంట్లో గాయపడిన చిర్కపల్లి గ్రామ సర్పంచ్ పగడాల రవి దొడ్ల కాసిం వార్డ్ మెంబర్ ఇద్దరినీ ఎమ్మెల్యే పరామర్శించి చికిత్స నిమిత్తం రూ ల. 10000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కట్టుకోవాలని ఉన్న తమకు ఆర్థిక పరిస్థితి సరిగా లేక పాత ఇండ్లలోనే ఉంటూ తీవ్ర ఇబ్బందులతో కాలం వెల్లదీశామని గత ప్రభుత్వంలో తమకు ఇల్లు మంజూరు అవుతాయని అనుకున్న ఎదురుచూపే మిగిలింది తప్ప సొంతింటి కల నెరవేరలేదని వారు వాపోయారు తమ సొంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో గోపాల్పేట ఏదుల మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, సర్పంచ్లు మాజీ సర్పంచ్లు వార్డు సభ్యులను తదితరులు పాల్గొన్నారు







## చలివేంద్రం ప్రారంభించిన

# చైర్ పర్సన్స్ "సుహాసిని"

**హుజరాబాద్ ఏప్రిల్ 3 సిటీ టైమ్స్ ప్రతినిధి**

వేసవి ఎండలు రోజురోజుకు విజృంభిస్తున్నాయని.. ఈ ఎండలకు తాళలేక బాటసారులు.. ప్రయాణికులు.. విద్యార్థిని విద్యార్థులు.. వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజు హుజరాబాద్ పట్టణానికి చుట్టుపక్కల గల పది మండలాల నుండి ప్రజలు.. ప్రయాణికులు.. వివిధ గ్రామాల నుండి వందలాది సంఖ్యలో విద్యార్థుల విద్యార్థులు వస్తుంటారని.. వారందరి దాహార్తిని తీర్చడం కోసం హుజరాబాద్ పట్టణంలో సరియైన ఏర్పాట్లు లేకపోవడానికి గమనించి స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈరోజు తన చేతుల మీదుగా దానిని ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా సుహాసిని వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పరిశుభ్రమైన చల్లని త్రాగునీటిని అందించే ఏర్పాట్లు చేశామని.. వేసవి ఎండలు తగ్గుముఖం పట్టే వరకు ఈ చలివేంద్రం అప్రతిహతంగా కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని పర్యవేక్షించడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు అతి ముఖ్యమైన సమస్యలు ఎదురైనప్పుడు తనను కానీ... మున్సిపల్ కమిషనర్ ను కానీ ఫోన్ ద్వారా లేదా నేరుగా సంప్రదించాలని ఈ సందర్భంగా చైర్మన్ సుహాసిని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్... కౌన్సిలర్లు లావణ్య నరసింహారెడ్డి.. వర్దినేని రవీందర్ రావు.. కోయల్ కార్ భారతి.. తాళ్లపల్లి రమేష్.. బండ నరేష్.. చందమల్ల పుణ్య.. మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి.. సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్.. కాంగ్రెస్ నాయకులు సందమల్ల బాబు.. కోయల్ కార్ బాలాజీ.. రషీద్.. రాజు.. శ్రీనివాస్.. వినయ్.. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

# 44 చట్టాలు నాలుగు కోడ్లు... కార్మిక హక్కులకు ముప్పు: ఆశా వర్కర్ల ఆందోళన



- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్ల బ్లాక్ డే నిరసనలు
- సిఐటియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన..
- పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్..
- 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చడంపై విమర్శలు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 02, (సిటీ టైమ్స్):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న "నాలుగు లేబర్ కోడ్ల"కు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు ఏప్రిల్ 1న బ్లాక్ డేగా పాటిస్తూ తీవ్ర నిరసన తెలిపారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ విధానాలపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్లు కార్మికులను బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రాలకు జారీ చేసిన అమలు ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. "ఈ కోడ్ లు అమలులోకి వస్తే కార్మికుల హక్కులు పూర్తిగా దెబ్బతింటాయి. అందుకే ఈ రోజును బ్లాక్ డేగా పాటిస్తూ మా నిరసన తెలియజేస్తున్నాం. కేంద్రం వెంటనే పునరాలోచించాలి" అని స్పష్టం చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ఉన్నికృష్ణ మాట్లాడుతూ, 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్ లు మార్చడం ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ కోడ్ లు అమలైతే వేతన భద్రత, పని గంటలు, ఉద్యోగ భద్రత వంటి కీలక అంశాల్లో కార్మికులు నష్టపోతారని హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ, కీసర ప్రాంతాల్లో ఆశా వర్కర్లు భారీగా ర్యాలీలు నిర్వహించి నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు లత, యాదమ్మ, మమత, ప్రవీణ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గ్రూప్1 నియామకాల్లో

# జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ

**హైదరాబాద్: సిటీ టైమ్స్**

ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్ 1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్ 1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# నేను నిప్పులాంటి వ్యక్తిని



### - నా పైన ఒక్క అవినీతి మరకలేదు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో అభివృద్ధి, పలు శాఖల్లో అవినీతిపై సభ్యులు విమర్శలు గుప్పించుకున్నారు. ఇక తాజాగా.. రాష్ట్ర రాజకీయం రోడ్ల అభివృద్ధి, హ్యామ్ టెండర్ల చుట్టూ తిరుగుతోంది. తనపై, ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అవినీతి ఆరోపణలను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన వ్యక్తిత్వాన్ని, పనితీరును ఉద్దేశించి మంత్రి కీలక కామెంట్స్ చేశారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదన్నారు. తాను నిప్పు లాంటి వ్యక్తి నని.. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. కనీసం ఆరోపణలు కూడా రాలేదని.. అలాంటిది తన శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని కోమటిరెడ్డి మండిపడ్డారు.

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల్లో భారీ స్కామ్ జరుగుతుందన్న విమర్శలను కోమటిరెడ్డి ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. పారదర్శకంగానే రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి వేముల ప్రశాంత్ రెడ్డికి కనీస జ్ఞానం లేదన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. కాగా, రోడ్ల అభివృద్ధి పేరిట తీసుకొస్తున్న హ్యామ్ రోడ్స్ విధానంలో రూ.8 వేల కోట్ల స్కాం జరుగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి ఇటీవల ఆరోపించారు. 6 వేల కిలోమీటర్ల హ్యామ్ మోడల్ రోడ్లకు రూ. 13 వేల కోట్లతో టెండర్ల పిలిచారన్నారు. మొబిలైజేషన్ కింద 10 శాతం అంటే రూ. 1300 కోట్లు ముందే ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యిందని ఆరోపించారు. ఈ టెండర్‌లో ఎక్సెస్ టెండర్ వేసుకోవాలని ప్రభుత్వమే సలహాలు ఇవ్వటాన్ని ఆయన తప్పుబట్టారు. హ్యామ్ మోడల్ రోడ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం మరోసారి రివ్యూ చేసుకోవాలని సూచించారు. ఈ రోడ్లను జేఇంఫ్రా , బృందా ఇంఫ్రా కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాని.. ఈ కంపెనీలకు అనుభవం లేదని.. ఆర్అండ్‌బీలో పనులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలకు తాజాగా కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు.







# రేవల్లి తాసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**వనపర్తి సిటీ టైమ్స్ ఏప్రిల్ 02**

నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాల ఏర్పాటు కోసం కలెక్టర్ చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన కార్యాలయ భవనాల ఏర్పాటుకు కృషి చేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి తెలిపారు రేవల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు రిబ్బన్ కట్ చేసి కార్యాలయంలోకి అడుగుపెట్టి పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఈ భవనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన



తరువాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు మారడం సంతోషకరమన్నారు. ఏదుల, రేవల్లి, శ్రీరంగాపూర్ మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.32 లక్షలను కలెక్టర్ తన సొంత నిధుల నుంచి కేటాయించి వేగంగా పూర్తి చేయించడం అభినందనీయమని తెలిపారు ఈ కొత్త భవనాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు ఇప్పటికే రేవల్లి నుండి ఏదులకు మంచి రహదారి సౌకర్యాన్ని ఇటీవలే నూతనంగా నిర్మించామని అలాగే రేవల్లి మండలంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ లైన్ ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం స్థలాన్ని ఇచ్చేందుకు సహకరించిన వారిని కలెక్టర్ మరియు ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# డంపింగ్ యార్డ్ విషయమై నేడు హుజురాబాద్ "బంద్"

### - డంపింగ్ యార్డ్ ను రద్దు చేయండి: సీఎంకు విజ్ఞప్తి
### - యార్డు ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**హుజురాబాద్ ఏప్రిల్ 3**
**సిటీటైమ్స్ ప్రత్యేకప్రతినిధి**

ఎట్టి పరిస్థితులలో హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కాకుండా ప్రయత్నిస్తానని.. ప్రజల డిమాండ్ ను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం దీని ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన అనుచరులు.. పార్టీ శ్రేణులతో కలిసి గురువారం డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం నిర్ధారించిన పరిసరాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల మూడున తలపెట్టిన హుజురాబాద్ బందును విజయవంతం చేయాలని.. అన్ని వర్గాల ప్రజలతో




పాటు వ్యాపారస్తులు.. విద్యా సంస్థలు ఇందుకు సహకరించాలని కోరారు. అత్యవసర విభాగాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని.. ఇది ప్రజల జీవన్మరణ సమస్య అనే విషయం గమనించాలని కౌశిక్ రెడ్డి సూచించారు. దీనినే ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతుందని.. అన్ని వర్గాల ప్రజలతో పాటు పశుపక్షాదులు కూడా రోగాల పాలు అవుతాయని.. త్రాగునీరు... సాగునీరు కలుషితమై జీవించే హక్కును ఈ ప్రాజెక్టు హరించి వేస్తుందని హెచ్చరించారు. దీనిని రద్దు చేయాలని కోరుతూ ఇటీవల అసెంబ్లీలో కూడా దీని గురించి ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఈ ప్రాంతంలో ఎలాంటి ఉద్యమాలు జరిగాయో మనందరికీ తెలుసునని.. ఆ తరహాలో మళ్లీ పోరాట చేయవలసిన రోజులు రావడం దురదృష్టకరమన్నారు. ఇది ప్రజల సమస్య కాబట్టి రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని... ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం సమంజసంగా ఉండదన్నారు. సీఎం వల్లనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు.. అడ్లూరి లక్ష్మణ్ కుమార్

.. పొన్న ప్రభాకర్.. శ్రీధర్ బాబు తదితరులకు దీని విషయమై ఇప్పటికే లేఖలు రాసినట్లు కౌశిక్ తెలిపారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే ఈనెల 7... ఎనిమిది తేదీలలో జేఏసీ నిర్వహిస్తున్న శిబిరంలో పాల్గొని దీక్ష చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు

### - 40 నిమిషాల పాటు ప్రధానితో చర్చలు జరిపిన
### - సంజయ్
### - కరీంనగర్ విజయంపై బండిని అభినందించిన ప్రధాని
### - కొండగట్టు అంజన్న పర్యటనపై ఆసక్తి చూపిన
### - నరేంద్రుడు"
### - రాష్ట్ర రాజకీయాలపై తాజా సమాచారం వివరించిన
### - బండి సంజయ్?
### - సిటీ టైమ్స్ కు వివరాలు వెల్లడించిన బిజెపి జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి

# ప్రధాని నివాసంలో "మోడీ"తో భేటీ అయిన "బండిసంజయ్"

**హుజురాబాద్ ఏప్రిల్ 3**
**సిటీ టైమ్స్ ప్రత్యేక ప్రతినిధి**

ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు వాడి వేడిగా జరుగుతున్న వేళ... మరోవైపు అమరావతి బిల్లు పై లోక్ సభ.. రాజ్యసభలలో దేశంలోని రాజకీయ పక్షాలు తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్న వేళ కరీంనగర్ పార్లమెంటు సభ్యులు.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని గురువారం సాయంత్రం అనగా కొద్దిసేపటి క్రితం ప్రత్యేకంగా కలిసి 45 నిమిషాల పాటు ఆయనతో కీలక చర్చలు జరిపినట్లు హుజూరాబాద్ పర్యటనలో ఉన్న బండి సంజయ్ శిష్యులు... భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి తాజా సమాచారాన్ని ఆలస్యంగా సిటీ టైమ్స్ ప్రతినిధికి తెలియజేశారు. అమరావతి బిల్లు ఇటు లోక్ సభలో.. అటు రాజ్యసభలో చర్చకు రాబోతున్న తరుణంలో తెలంగాణ నుండి కేంద్ర మంత్రులైన బండి సంజయ్.. కిషన్ రెడ్డిలు తెలుగుదేశం ఎంపీలకు.. తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్ర మంత్రులకు.. అలాగే ఆంధ్రప్రదేశ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలకు.. తమ పార్టీ మంత్రికి సహకరించాలని ఒక రోజు ముందుగానే ప్రధానమంత్రి మోదీ స్వయంగా వీరిద్దరిని అప్రమత్త చేసినట్లు సమాచారం. అమరావతి బిల్లు చట్టసభలలో ఆమోదం పొందే వరకు దారి తీసిన పరిణామాలను ప్రతిక్షణం ప్రధానమంత్రి తెలుసుకునే ప్రయత్నం చేశారని బండి సంజయ్ అనుచర వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇకపోతే ఇటీవల జరిగిన కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ బండి సంజయ్ నాయకత్వంలో కరీంనగర్ కార్పొరేషన్ ను ఒంటి చేత్తో కైవసం చేసుకోవడం వంటి పరిణామాల గురించి ఆనాడే తెలుసుకున్న ప్రధానమంత్రి మోడీ ఈరోజు తనను కలిసిన సందర్భంగా బండి సంజయ్ ను ప్రశంసల వర్షంతో ముంచెత్తినట్లు సమాచారం అందిందని కర్రె సంజీవరెడ్డి హుజురాబాద్ లో "సిటీటైమ్స్" ప్రతినిధికి గురువారం రాత్రి 11:30 గంటలకు తెలిపారు. కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించకుండా టిఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీలు ఏకమై కుమ్మకు రాజకీయాలు చేసినప్పటికీ.. వ్యూహాత్మకమైన ప్రణాళికతో ముందుకు సాగి ఎవరి మద్దతు లేకుండా రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కరీంనగర్ కార్పొరేషన్ ను కైవసం చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా బండి



సంజయ్ ప్రధానమంత్రి మోడీతో ప్రధానంగా ప్రస్తావించగా.. సంజయ్ జీ.. మీ గురించి నాకు తెలుసు.. చాలా సింపుల్ గా కనిపిస్తారు.. వ్యూహాలను మాత్రం పటిష్టంగా అమలు చేస్తారు.. అందుకు అనుగుణంగా ఫలితాలను రాబట్టుతారు.. ఈ విషయంలో మీకు మీరే సాటి అంటూ ప్రధాన మోడీ బండి సంజయ్ కి ఇచ్చినట్లు బిజెపి వర్గాలలో "ఆల్ రెడీ"ఈపాటికే చర్చ మొదలైనట్లు కర్రే సంజీవరెడ్డి వెల్లడించారు. ఇకపోతే కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికలలో స్పష్టమైన మెజారిటీతో మేయర్ పీఠాన్ని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకున్నట్లయితే కొండగట్టు ఆంజనేయస్వామిని పార్టీ శ్రేణులతో కలిసి వచ్చి దర్శించుకుని.. మొక్కులు సమర్పించుకుంటానని కార్పొరేషన్ ఎన్నికల ముందే ప్రకటించానని.. అంజన్న ఆశీర్వాదంతో తాను ఆశించినట్లుగా ఫలితం వచ్చిందని.. అందువల్లనే దాదాపు పదివేల మంది పార్టీ శ్రేణులతో కలిసి కరీంనగర్ నుండి కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఎంతవరకు 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి మొక్కులు సమర్పించుకున్న విషయాన్ని ప్రధానమంత్రి మోడీకి బండి సంజయ్ వివరించిన విషయాన్ని ఈ సందర్భంగా కర్రె సంజీవరెడ్డి తెలిపారు. హనుమాన్ అంటే తనకు కూడా అమితమైన భక్తితో పాటు ప్రతిక్షణం ఆయనను మనసులోనే ఆరాధించుకుంటారని.. అలాంటి హనుమాన్ చెంతకు వెళ్లి మొక్కులు సమర్పించుకోవడం ప్రశంసనీయమని.. తనకు కూడా తృప్తిని కలిగిస్తున్నదని బండి సంజయ్ తో ప్రధాని మోడీ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. పాదయాత్రలో 10,000 మంది పార్టీ శ్రేణులు భాగస్వామ్యం చేయడం పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేసినట్లు సంజీవ్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి.. కేంద్రం నుండి రాష్ట్రానికి వస్తున్న నిధుల గురించి.. కేంద్రం ద్వారా రాష్ట్రంలో.. జిల్లాలలో.. నియోజకవర్గాలలో.. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలకు ఓటర్లకు చేరువైన విషయాల్ని చర్చల సందర్భంగా బండి సంజయ్ ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా "మోడీ గిఫ్ట్"పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన విషయాన్ని మోడీతో బండి సంజయ్ ప్రధానంగా ప్రస్తావించిన విషయాన్ని తండ్రి సంజీవరెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు.. ప్రజా ప్రతినిధుల అందరి తరపున సంజయ్ ప్రధానికి కృతజ్ఞతలు.. అభినందనలు తెలిపినట్లు సంజు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని.. అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందేలా పార్టీ శ్రేణులు కృషి చేసేలా ప్రోత్సహించాలంటూ బండి సంజయ్ ను ప్రధాని కోరినట్లు కర్రి సంజీవరెడ్డి వివరించారు. ఇదిలా ఉండగా తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితుల గురించి... భారతీయ జనతా పార్టీ "మైలేజ్" గురించి.. టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల పట్ల ప్రజలలో ఉన్న అభిప్రాయం గురించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రధాని వివరించినట్లు సమాచారం.





# 15 రోజులు బెంగాల్లోనే ఉంటా

- మమత ప్రభుత్వాన్ని గద్దె దించుత
- కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా
- సురేంద్ర అధికారి నామినేషన్కు హాజరు
- ప్రజలే బిజెపి నీ గెలిపిస్తారు

**కోల్‌కతా, సిటీ టైమ్స్**

15 రోజుల పాటు బెంగాల్‌లోనే ఉంటానని.. మమత సర్కార్‌ను గద్దె దించుతామని అమిత్ షా సవాల్ విసిరారు. సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమానికి అమిత్ షా హాజరయ్యారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. తాను రాబోయే 15 రోజుల పాటు బెంగాల్‌లోనే ఉంటానని కీలక ప్రకటన చేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలు ఇప్పుడు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.

సువేందు అధికారి నామినేషన్ కోసమే ప్రత్యేకంగా బెంగాల్‌కు వచ్చానని.. సువేందు విజయం బెంగాల్‌లో మార్పునకు పునాది వేస్తుందన్నారు. గతసారి నందిగ్రామ్‌లో ఓడిపోయిన మమతా బెనర్జీ.. ఈసారి భవానీపూర్‌తో పాటు యావత్ బెంగాల్‌లోనూ ఓడిపోతారని జోస్యం చెప్పారు. సువేందు అధికారి నామినేషన్ బెంగాల్‌లో టీఎంసీ పతనానికి నాంది అని అన్నారు. ఈసారి నందిగ్రామ్ ప్రజలు చరిత్రను పునరావృతం చేసి మమతా బెనర్జీని అధికారం నుంచి గద్దె దించుతారని ధీమా వ్యక్తం చేశారు.

తాను బెంగాల్ రాష్ట్రమంతా పర్యటించానని, తాను వెళ్లిన ప్రతిచోటా ఒకే స్వరం విన్నానని పేర్కొన్నారు. మమతా బెనర్జీకి వీడ్కోలు పలకండి. ప్రభుత్వానికి వీడ్కోలు పలకండి. మమతా బెనర్జీకి గుడ్ బై చెప్పండి అనే ఒకే స్వరం మాత్రమే తనకు వినిపించిందని పేర్కొన్నారు. దోపిడీ, గూండాయిజంతో బెంగాల్ ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆరోపించారు. తరచుగా జరుగుతున్న బాంబు పేలుళ్లు, నిరుద్యోగంతో యువత ఇబ్బందులు పడుతోందన్నారు. టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని.. దీంతో రాష్ట్ర జనాభా స్వరూపాన్ని మారుస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగాన్ని నిర్మూలించి.. నూతన అభివృద్ధిని తీసుకువస్తామని.. తద్వారా బెంగాల్ తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలదని అమిత్ షా యువతకు హామీ ఇచ్చారు.

# నిర్మల సీతారామన్ కు బిగ్ రిలీఫ్

- పరువు నష్టం కేసు కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు
- ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేకు చుక్కెదురు
- ఫిర్యాదులో ఎలాంటి పస లేదు
- విచారణను ముందుకు తీసుకెళ్లలేమన్న జడ్జి

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఢిల్లీ న్యాయస్థానం భారీ ఊరట కల్పించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ ఎమ్మెల్యే సోమనాథ్ భారతి భార్య లిపికా మిత్ర దాఖలు చేసిన పరువు నష్టం ఫిర్యాదును ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. ఈ కేసులో విచారణ జరిపేందుకు తగిన ఆధారాలు లేవని ధర్మాసనం స్పష్టం చేసింది.

అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరస్ దలాల్ ఈ ఫిర్యాదును పరిశీలించి.. నిందితురాలిపై తదుపరి చర్యలు తీసుకోవడానికి ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. "ఈ విషయంలో ముందుకు వెళ్లడానికి నాకు ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. అందుకే ఈ ఫిర్యాదును స్వీకరించడానికి నిరాకరిస్తున్నాను" అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

**అసలేం జరిగిందంటే?**

2024 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో మే 17వ తేదీన నిర్వహించిన ఓ మీడియా కాన్ఫరెన్స్‌లో నిర్మలా సీతారామన్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సోమనాథ్ భారతి, ఆయన భార్య లిపికా మిత్రల గొడవల గురించి చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియోలు అప్పట్లో వైరల్ కావడంతో.. లిపికా మిత్ర కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌పై పరువునష్టం దావా కేసు వేశారు. అందులో తన వైవాహిక జీవితానికి సంబంధించి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలన్నీ అవాస్తవమైనవి పేర్కొన్నారు. ఇవి పూర్తి దురుద్దేశపూర్వకంగా ఉన్నాయని ఆరోపించారు.

**వీడియోలన్నీ డిలీట్ చేసేలా ఆదేశాలివ్వమంటూ..!**

న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఇండియా బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త పరువు తీయడమే లక్ష్యంగా నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారని లిపికా మిత్ర పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు టీవీలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విస్తృతంగా ప్రసారం కావడం వల్ల తన భర్త అంతర్జాతీయ స్థాయిలో అవమానానికి గురయ్యారని, తీవ్ర మానసిక వేదనకు లోనయ్యారని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 356(1), 356(2) కింద నిర్మలా సీతారామన్‌ను విచారించాలని.. అలాంటి వ్యాఖ్యలు మళ్లీ చేయకుండా అడ్డుకోవాలని ఆమె కోర్టును కోరారు. అంతేకాకుండా అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సదరు వీడియోలు డిలీట్ చేయాలని ఆదేశాలు జారీ చేయాలని కూడా విన్నవించారు. ఈక్రమంలోనే ఫిర్యాదును పరిశీలించిన న్యాయస్థానం.. ఈ కేసులో నేరం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించడానికి అవసరమైన ప్రమాణాలు లేవని తేల్చి చెప్పింది. రాజకీయ విమర్శలు లేదా ఎన్నికల ప్రచారంలో చేసే వ్యాఖ్యలు అన్నీ పరువునష్టం కిందకు రావని పేర్కొంది. అలాగే ఈ ఫిర్యాదులో పస లేదని భావిస్తూ కేసును తోసిపుచ్చింది. దీంతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు భారీ ఊరట లభించింది.



# మా రాష్ట్రానికి వచ్చి చూడండి

- తెలంగాణలో అయితే కేసీఆర్ ఫ్యామిలీ
- కేరళలో అయితే పినరయి విజయన్ ఫ్యామిలీ
- ఈ రెండు ఫ్యామిలీలకు పెద్ద తేడా లేదు
- తెలంగాణలో కేసీఆర్ బ్రస్టు పట్టించారు
- కేరళలో అదే విజయన్ చేశారు

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**



కేరళం సీఎం పినరయ్ విజయన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రానికి వచ్చి 'ఆరు గ్యారెంటీలు' ఎలా అమలు అవుతున్నాయో స్వయంగా చూసి నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తున్నాయో వివరించారు. రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతుల లోన్లు మాఫీ చేసినట్లు సీఎం తెలిపారు. అలాగే రైతు భరోసా కింద రూ.18 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేసి రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించామని సీఎం రేవంత్ చెప్పారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా రాష్ట్రంకి వచ్చి మా సిక్స్ గ్యారెంటీలు ఎలా అలవుతున్నాయో చూడండి. రైతుల లోన్ వేవ్ చేశాము. రైతు భరోసా కింద 18 వేల కోట్ల రూపాయలు ఇచ్చాం. 67173 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాము. కేరళంలో పినరయ్ విజయన్‌కి సమయం అయిపోయింది. తెలంగాణలో కేసీఆర్ ఫ్యామిలీకి.. కేరళంలో పినరయ్ విజయన్‌కి పెద్ద తేడా లేదు. పదేళ్లలో అటు తెలంగాణను కేసీఆర్.. ఇటు కేరళంను పినరయ్ విజయన్ భ్రష్టు పట్టించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తోంది. ఈ నెలలో కేరళంలో కూడా మరో పదేళ్ల పాటు యూడీఎఫ్ గవర్నమెంట్ నడిచేలా ప్రభుత్వం వస్తుంది' అని అన్నారు.

# అధికారులను బంధిస్తారా?

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ 'సర్'కు చెందిన అధికారులను దిగ్బంధించడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మందలించింది. ఇదంతా పక్కా ప్రణాళికతో చేసిన కుట్రగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. దీంతో బెంగాల్ ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

బెంగాల్‌లోని మాల్దాలో న్యాయాధికారులను దిగ్బంధించి దాడులు జరిగినట్లుగా వచ్చిన వార్తలు తీవ్ర కలకలం రేపాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి అధికారులను బంధించి తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు న్యాయస్థానం దృష్టికి వచ్చింది. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్రంగా పరిగణించారు.



పశ్చిమ బెంగాల్‌లో న్యాయాధికారులను బందీలుగా పట్టుకోవడంపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సుమోటోగా స్వీకరించారు. ముట్టడికి గురైన న్యాయాధికారి ఐదేళ్ల బిడ్డ కూడా ఇంట్లోనే ఉండటంతో తాను నిన్న రాత్రి కఠినమైన ఉత్తర్వులు జారీ చేయక తప్పలేదని.. ఆ తర్వాతే యంత్రాంగం చర్యలు తీసుకుందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. దేశంలోనే "అత్యంత ధ్రువణమైన' రాష్ట్రంగా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడానికి 'ముందస్తుగా ఆలోచించి, లెక్కించి, ఉద్దేశపూర్వకంగా" చేసిన కుట్రగా ధర్మాసనం పేర్కొంది.

పశ్చిమ బెంగాల్ అడ్వకేట్ జనరల్‌ను ఉద్దేశించి సూర్యకాంత్ మాట్లాడుతూ.. "దురదృష్టవశాత్తు మీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారు. అల్లరి మూకలు ఎవరో మాకు తెలియదని మీరు అనుకుంటున్నారా? నేను తెల్లవారుజామున 2 గంటల వరకు ప్రతిదీ గమనిస్తూనే ఉన్నాను. ఇది చాలా దురదృష్టకరం." అని వ్యాఖ్యానించారు. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ అధికారులను సురక్షితంగా తరలించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, డీజీపీ, జిల్లా మేజిస్ట్రేట్‌లతో సహా రాష్ట్రంలోని ఉన్నతాధికారులను ప్రధాన న్యాయమూర్తి మందలించారు.

"బుధవారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో న్యాయాధికారుల ముట్టడి ప్రారంభమైందని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. రిజిస్ట్రార్ జనరల్ పరిపాలనా అధికార యంత్రాంగానికి సమాచారం అందించి.. తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి 8:30 గంటల వరకు ఏమీ చేయలేదు. ఆ సమయంలో హోం సెక్రటరీని సంప్రదించాం. డీజీపీ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో గ్రూప్ కాల్ నిర్వహించాం. తక్షణ చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఎటువంటి నిర్దిష్ట చర్య తీసుకోలేదు." అని ధర్మాసనం తెలిపింది.

"కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక లేఖలో.. జిల్లా మేజిస్ట్రేట్ గానీ, పోలీసు సూపరింటెండెంట్ గానీ సంఘటనా స్థలానికి చేరుకోలేదని పేర్కొన్నారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), హోం సెక్రటరీని పిలిపించాల్సి వచ్చింది." అని సీజేఐ అన్నారు.

"బుధవారం జరిగిన సంఘటనపై కోర్టు అధికారాన్ని సవాలు చేసేందుకు జరిగిన చర్య సిగ్గుమాలిన ప్రయత్నం. న్యాయాధికారులను నిరుత్సాహపరిచి.. ప్రక్రియను అడ్డుకోవడానికి ఇది పక్కా ప్రణాళికతో చేసిన ఎత్తుగడ. ప్రధాన కార్యదర్శి, డీజీపీ, హోం కార్యదర్శిల ప్రవర్తన పూర్తిగా ఖండనీయం." అని సూర్యకాంత్ అన్నారు. అధికారులను దిగ్బంధించడంపై బీజేపీ నేత అమిత్ మాల్వీయ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు.

# మా మిత్రులు సేఫ్

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**



పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జల సంధిని ఇరాన్ నియంత్రించడంతో ట్యాంకర్ల రవాణా నిలిచిపోయి అంతర్జాతీయ మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. ఈ క్రమంలో భారత్‌కు ఊరటనిచ్చేలా ఇరాన్ గురువారం కీలక ప్రకటన చేసింది. హర్మూజ్ జలసంధి గురించి తమ 'భారతీయ మిత్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. వారు సురక్షితంగా ఉన్నారు' అని ఇరాన్ తెలిపింది. ఈ మేరకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టి ఓ పోస్ట్‌లో తెలిపింది. ఇదిలా ఉండగా, హర్మూజ్ నుంచి వెళ్లే ఆయిల్ ట్యాంకర్ నౌకలు టోల్ ఫీజు కింద 2 మిలియన్ డాలర్లు వసూలు చేయాలని ఇరాన్ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ సంయుక్తంగా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ చేపట్టి ఇరాన్‌పై జరిపిన దాడితో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైంది. తొలి రోజే సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ సహా ఇరాన్ ముఖ్య నేతలు మరణించారు. దీంతో ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగి.. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, వారి మిత్రదేశాల ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో ప్రపంచ చమురు సరఫరాలో 25 శాతం రవాణాకు కీలకమైన హర్మూజ్ జల సంధిని దాదాపు మూసివేసింది. దీంతో ఆయిల్, గ్యాస్ ట్యాంకర్ నౌకల రవాణా స్తంభించిపోయింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత కొద్ది నౌకలు మాత్రమే హర్మూజ్‌ను దాటాయి. ఈ దిగ్బంధనం కారణంగా భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి.

అయితే, భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి తమ మిత్రదేశాల నౌకలకు హర్మూజ్ ప్రయాణానికి అనుమతి ఇచ్చామని ఇరాన్ తెలిపింది.ఇప్పటి వరకూ కనీసం 8 భారతీయ నౌకలు హర్మూజ్ దాటి వచ్చాయి. వీటిలో 94 వేల టన్నుల సామర్థ్యం కలిగిన రెండు ఎల్పీజీ ట్యాంకర్లు బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఈఎల్‌మ్ ఉన్నాయి. కానీ, హర్మూజ్‌లో భారత్‌కు చెందిన మరో 19 వరకు ఎల్పీజీ, క్రూడాయిల్ ట్యాంకర్లు ప్రస్తుతం చిక్కుకున్నాయి.

మార్చి 30న పశ్చిమాసియాలో పరిణామాలపై జరిగిన సమావేశంలో పోర్ట్స్ అండ్ నౌకాయాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. భారత్‌కు ఇంధనంతో వస్తున్న 10 విదేశీ జెండా నౌకలు ప్రస్తుతం నిలిచిపోయాయని తెలిపారు. వీటిలో ఎల్పీజీతో ఉన్న 3 నౌకలు, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, మూడు సహజ వాయువు రవాణా నౌకలు ఉన్నాయని చెప్పారు.

# ఆస్తిలో హక్కే కాదు సంరక్షణలో సమన బాధ్యత

- సూర్యాపేట జిల్లాకు చెందిన పిటీషనర్ కేసులో తీర్పు
- ఆస్తితో పాటు బాధ్యతలు పంచుకోవాల్సిందే
- జస్టిస్ విజయ సేన్ కీలకతీర్పు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కోరుకుంటున్న కుమార్తెలు.. వృద్ధాప్యంలో వారిని సంరక్షించే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తి హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. నేటి సమాజంలో వృద్ధ తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న దీన స్థితిపై ఆవేదన వ్యక్తం చేసింది.

కేసు వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లాకు చెందిన సదరు పిటిషనర్ తన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని తన ఆస్తిని తిరిగి ఇచ్చేలా అధికారులు ఇచ్చిన ఆదేశాలను లెక్క చేయటం లేదని కోర్టును ఆశ్రయించింది. 'తల్లిదండ్రుల సంరక్షణ వయోవృద్ధుల సంక్షేమ చట్టం' కింద ఇంటి పత్రాలను, భూమిని తిరిగి ఇవ్వాలని 2025 డిసెంబర్‌లో పిటిషనర్ కుమారుకి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఆ ఉత్తర్వులను కుమారుడు బేఖాతరు చేయటమే కాకుండా.. తనను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె వాపోయింది. ప్రస్తుతం తాను కుమార్తె వద్ద ఉంటున్నానని పిటిషన్‌లో పేర్కొంది.

ఈ విచారణ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సమాజంలోని పోకడలను ఎత్తిచూపారు. ప్రస్తుతం కోర్టుల్లో వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారులు, కోడళ్లను ఆస్తుల నుంచి గెంటివేయాలని కోరుతూ దాఖలు చేసే పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయని చెప్పారు. ప్రతిరోజూ కనీసం రెండు వరకు ఇలాంటి పిటిషన్లు విచారణకు వస్తున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాజీ మార్గాలు వెతకాలన్నారు. ఆస్తి నుంచి వెలివేయడం అనేది చివరి ప్రయత్నంగా ఉండాలని.. కానీ బాధితులు మొదటి దశలోనే ఆ విజ్ఞప్తి చేస్తున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ముఖ్యంగా కుమార్తెల బాధ్యత గురించి ప్రస్తావిస్తూ.. కేవలం కుమారులు లేని వారే కాదు, కుమార్తెలు ఉన్నవారు కూడా వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నారని కోర్టు అభిప్రాయపడింది. చాలా సందర్భాల్లో కుమార్తెలు తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులు కోరుకుంటున్నారు కానీ, వారిని సంరక్షించే విషయంలో వెనకాడుతున్నారన్నారు. కేవలం కుమార్తెలు మాత్రమే ఉన్న తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని కోర్టు ప్రశ్నించింది. కుమార్తెలు కచ్చితంగా బాధ్యత వహించాలని స్పష్టం చేశింది. ఆస్తిలో వాటా అడిగే ప్రతి కుమార్తె, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యతను కలిగి ఉంటుందని గుర్తు చేశారు.

విచారణ సందర్భంగా కోదాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో పోలీసు, పరిపాలనా యంత్రాంగం విఫలమైందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అధికారులు పట్టించుకోకపోవటం పిటిషనర్ హక్కులను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి కోర్టుకు విన్నవించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. పిటిషనర్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సూర్యాపేట జిల్లా అధికారులను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఏప్రిల్ 15వ తేదీకి వాయిదా వేశారు.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad 500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**